# స్వర్గాదపి

అది అతడి స్వగ్రామం. దానంత మంచిఊరు మరొకటిలేదు. దానంత కుళ్లుది ఇంకొకటి లేదు. అది అతడికి ఆప్త మిత్రుడు. అదే అతడి గర్భశత్రువు. కలలో బాగుంటుంది. ఇలలో ఇంపుగా ఉండదు. దాన్నతడు మెచ్చుకోలేడు, ఇంకొకళ్లు తిడితే సహించలేడు.

ఆ ఇరుకులో, మురికిలో, అతడు ఇమడలేకపొయ్యాడు. పారిపొయ్యాడు. ఆ ఊరి నతడు వదిలిపెట్టి పుష్కరం దాటింది. ఈ పన్నెండేళ్ళూ దాన్నతడు తలచుకోనిరోజంటూ లేదు. ఏ కొత్తవూరి కెళ్ళినా ఆ వూరిని తన వూరితో పోల్చుకోనక మానడు.

స్వగ్రామం సుగ్రాం కాదు, చిక్కి శల్యమైన వాడి లాల్చీలాగ వదులుగా వున్న ఊరు. అలాగని ఆ వూరిజనాభా అంత్యంతమాత్రం కాదు. బెల్లంచుట్టూ ముసిరే ఈగల్లాగ ఒకటే మంద. ఆ ఊరు నెలలుతరబడి రేవుచూడని లాల్చీ కాదు, కాదు, సంవత్సరాల తరబడి ఉతకని పొత్తుపంచ.

అవును, ఆ ఊరు మడిబట్ట. అందులోకీ అపరిశుభ్రమైనది. అనన్యమైనది. అసహ్యమైనది. ఆ వూరివాళ్ళకి బుద్ధీ జ్ఞానంలేదు. అయినా ఆ వూరినుంచి మహామేధావులు పైకొచ్చారు. ఆ వూరు మోటుతనంలో రాటు తేరింది. అయినా ఆ వూరివాళ్ళ హృదయాలు నాజూకైనవి. సరళమైనవి. లలితమైనవి. ఎండలో నేతిముద్దని పెడితే కరక్కపోవచ్చు – బాధ

పడుతున్న వాళ్ళని చూస్తే ఆ వూరి హృదయాలు కరిగి ఆన వాళ్లుకూడా దొరకవు, ఆ వూరు అన్ని వూళ్ళవంటిదే.

పుట్టి పెరిగిన ఊరిని కట్టుబట్టలతో విడిచిపెట్టిన ఇన్నాళ్ళకి, అతడు మళ్ళా అక్కడికి చేరుకున్నాడు. రైలు ఆ వూరి పరిసరాలకి సమీపించగానే అతడి హృదయం ఉవ్వెత్తున యెగిరింది. రైలు పెట్టెలో అతనొక్కడే ఉన్నాడు. కుడిచేతి పక్క కిటికీలోంచి చూస్తున్నాడు. చిన్నప్పుడు వనభోజనాలకి వచ్చిన తోట కనబడింది. దాన్నిచూసి అతడు గుర్తుపట్టలేక పోయాడు. పిరుదులదాకా వేళ్ళాడే ఒత్తుగా ఉన్న జుత్తుని కత్తిరించి 'బాబ్' చేసుకొన్న రంగేళీయువతిలాగ తోట పలచబడింది. శివార్లలో బంగళాలు లేచాయి. కుడి ప్రక్క దృశ్యాలు చూస్తూవుంటే ఎడంపక్క చూడవలసినవి చూట్టంలేదే అని బాధపడ్డాడు. ఎడం పక్కకి చూపు తిప్పాడు. ఎడం పక్కని దొరల గోరీలతోట ఉంది. గోరీల తోటే. ఏ వూళ్ళో అయినా అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ మారదు.

గోరీలతోటని చూడగానే అతడికి చిన్నప్పటిస్మృతులు జ్ఞాపకానికొచ్చాయి. పదహారేళ్లు నిండిన వేడివయస్సులో — దేముడిమీద నమ్మకం, దెయ్యాలంటే భయం పోతున్న రోజుల్లో తానూ స్నేహితులూ కలిసి గోరీలతోట గోడల్ని గెంతి చెయ్యెత్తు పెరిగిన పచ్చగడ్డిలో కూర్చుని చదవకూడని పుస్తకాలు చదువుకొన్నారు. పిక్నిక్‌లు జరుపుకొన్నారు. అది వాళ్ళ అద్దెకట్టక్కర్లేని లాడ్జి.

గోరీలతోటలోని ఒకనాటి సంఘటనని తలచుకొంటే అతనికి యిప్పుడు ఒళ్లు గగుర్పొడిచింది. అనాడు మధ్యాహ్నం ఎర్రనిఎండ మండుతున్న సమయంలో అతడు గోడగెంతి తోటలో దిగాడు. అప్పటికి స్నేహితులు రాలేదు. ఒక చెట్టు కింద బల్లపరుపుగా ఉన్న గోరీమీద కూర్చొని తను సిగరెట్ ముట్టించాడు. గోరీపలకలమీద అక్షరాలు చదివాడు. జోన్ పాల్సన్ అనే పదహారేళ్ళవ్యక్తి సమాధి అది. అంటే తన వయస్సువ్యక్తికే, జోన్ అన్న పేరు ఆడపేరో మగపేరో తనకు తెలియదు. ఎండవేపుతున్నాది. చెమటలుకారుతున్నాయి. అతడు లాల్చీవిప్పి చెట్టుకొమ్మకి తగిలించాడు. సమాధిమీద వెలకితలా పడుకొని సిగరెట్టుకాల్చి ఆఖరిపీల్పులు పీల్చి పారేశాడు. ఎప్పుడు నిద్రపట్టిందో తనకు తెలియదు.

కాల్చి పారవేసిన సిగరెట్ పీకవల్ల ఎండుటాకులు అంటుకొన్నాయి. ఆ సెగచేత ఆకుల్లోదాగిన పురుగులు బయటకు వచ్చాయి. గోరీచుట్టూ మంటలు, గోరీమీదకి పురుగులు చేరుతున్నాయి. ఇంతలో అతడికి తెలివివచ్చింది. తోట తలుపులు తెరచుకొని దొరలు దొరసానులు లోపలికి వస్తున్నారు. తనకి గాభరా పుట్టింది. కాళ్ళదగ్గర పురుగులు, చుట్టూ మంటలు, కోపగించుకున్న దొరలు, దొరసానులు — ఏంచెయ్యాలో తోచక, ఏదైనా తోచకముందే ఒక్క గెంతు వేసి గోడయెక్కి వీధిలోకి గెంతి పారిపోయ్యాడు. లాల్చీ మరచిపోయి. ఆ దొరలు, దొరసానులు ఏమనుకున్నారో!

లాల్చీ లేకుండా వూళ్లోకెళ్ళడం సిగ్గు. బనీనుకూడా లేదు. లాల్చీకోసం చీకటిపడేదాకా వనభోజనాల తోటలో

గడిపి రాత్రి బాగా పొద్దుపోయాక యింటికి చేరుకున్నాడు. ఇంట్లో తాను అడుగుపెట్టేసరికి తన లాల్చీ కనబడింది. కాల రుద్రుడిలాగ నాన్న తనకోసం కాచుకొని వున్నాడు. ఏం ప్రశ్నించకుండా తనని నాన్న చితకబాదాడు. ఒళ్లు హూనం చేశాడు. తినగలిగినన్ని దెబ్బలు తిని తనకి తెలియకుండానే నాన్నమీద తను తిరగబడ్డాడు. మాటకిమాట ఎదురు చెప్పాడు. ఎదిగిన కుర్రాణ్ణి కొట్టకూడదని నాన్నకి అప్పుడే తట్టింది. తాను ఎదురుతిరగడం తనకీ, నాన్నకీ ఒక్కసారే ఆశ్చర్యం వేసింది (అదే ఆఖరిసారి. నాన్న తనని కొట్టడం.) తను ఎదురుతిరగ్గానే నాన్న తనని ఇంట్లోంచి పంపించివేశాడు. తాను వీధరుగుమీదే కూర్చున్నాడు. అర్థరాత్రివేళ అమ్మ అన్నం తీసుకొచ్చి పెట్టింది. నాన్న చూసీచూడకుండా వూరుకున్నాడు. తెల్లవారుఝామున పనిమనిషి వచ్చేవేళ, అమ్మ తలుపు తెరిస్తే తాను ఇంట్లోకివెళ్ళి చలివేస్తున్నందు చేత కప్పుకొని పడుకొన్నాడు. తాను నిద్రలేచేలోగా నాన్న వీధిలోకి వెళ్ళిపొయ్యాడు. ఆ రాత్రి నాన్న నిద్రపోయాక తాను యింటికి వచ్చాడు. మూడురోజులు ఇద్దరూ మాట్లాడుకోలేదు. నాలుగోరోజున స్కూలుజీతం కట్టాల్సివచ్చింది. అడిగేక నాన్న మారుమాట్లాడకుండా ఇచ్చాడు. అయిదో రోజున అడక్కుండానే నాన్న లాల్చీగుడ్డ కొని తెచ్చాడు.

రైలు ప్లాటుఫారంమీదకి వస్తూన్నాది. అతడికి అది ఏనుకుతూరి ప్లాట్‌ఫారమేనా అన్న అనుమానం కలిగింది, తాను విడిచిపెట్టినప్పుడు అది బోడిగా మొండిగా బోసిగా

వుండేది. ఇప్పుడో పైన రేకుల షెడ్డు. పుస్తకాల అంగడి, టీ దుకాణం, ఎన్నో మార్పులు, ఎం   అభివృద్ధి.

రైలు దిగగానే ఒక్కడూ తన్ను గుర్తుపట్టలేదు. సామాన్లుమోసే కూలివాళ్లు, టికెట్లు వసూలుచేసే ఉద్యోగి, 'అబ్బాయిగారూ! బండి!' అని చుట్టుముట్టే బళ్ళవాళ్లు – ఎవరూ తనని గుర్తుపట్టలేదు. అతడి మనస్సు చివుక్కుమంది. బళ్ళవాళ్ళలో తనని ఎవరూ గుర్తుపట్టకపోవడం అతడికి మరీ బాధ అనిపించింది. పదమూడేళ్ళకిందట ఆ వూరి బళ్ళవాళ్ళ యూనియన్ స్థాపించడానికి కారకులలో తా నొకడు. యూనియన్ సోషలిస్టులచేతుల్లోకి తా నెంత కష్టపడ్డాడని! విశ్వాసఘాతుకులు. ఈ బళ్ళవాళ్ళు తనని గుర్తించలేదు. వాళ్ళలో తనను తెలిసినమొఖం ఒకటీలేదని తాను మరచిపోయ్యాడు.

బండి కట్టించుకో లేదు. నడక సాగించాడు. ఎంత చిన్న సందులు; ఎంత మురికి వీధులు రెండు పక్కలనుంచీ ఇళ్ళు దగ్గరగాజరిగి తన్ను నలిపేస్తాయేమో అన్నంత సన్నని సందులు. ఇంట్లోని చెత్తంతా ఇళ్ళముందు పోసే పరిశుభ్రమైన ఇల్లాళ్లు. మేట వేసిన నుళ్లు కాలవలు. రోడ్డుమీద కూర్చున్న దిసమొల కుర్రాళ్లు. పెంటపోగులు. తడిగా విడిగా తిరుగుతున్న పందులు. గజ్జి కుక్కలు. అప్పటికే ధూళిలో కలసిన ముగ్గులు. అన్నీ తెలిసిన వీధులే; కంఠస్థం అయిన దారులే!

ఈ వీధిలోంచే బడికి వెళ్ళేవాడు. ఇక్కడే తాను కావాలని ఉత్తపుణ్యానికి పలక బద్దలు కొట్టేడు. ఇదుగో

ఇక్కడ గోలీలు ఆడేవాడు. ఈ ఊరి దుమ్మునికూడా తాను గుర్తుపట్టగలడే! తనెవరూ పోల్చుకోరేం? వీధరుగుమీద కూర్చుని పళ్లు తోముకుంటున్న నిద్రమొగాలు ఏ ఒక్కటీ తనని పలకరించదేం? తనరూపు రేఖలు అంత మారి పోయాయా? తాను పరాయివాడయిపోయాడా?

మంగలి రామన్న పొదిపట్టుకొని నడుస్తున్నాడు. తన యింట్లో వాడు వాడికమంగలాడు. వీడితో తా నెన్ని యుద్ధాలు చేశాడు? సెలూనుకెళ్ళి క్షవరం చేయించుకొనే వయస్సూ, ధైర్యం వచ్చేదాకా వీడిచేతుల్లోనే తన తల అప్పగించేవాడే – వీడుకూడా తనని గుర్తుపట్టలేదా?

'రామన్నా! ఆగరా! ఆగు – గేష్టంగేయి.'

ఆగడే–వినడే. ఊ రెంత మారిపోయింది? ఊర్లో మనుష్యు లెంత మారిపోయ్యారు?

లేదు–ఊరూ మారలేదు. మనుష్యులూ మారలేదు. అదే చెత్త. అదే చదారం. అదే సందులూ గొందులూ. అదుగో ఆ చెరువే ఇప్పటికీ వుంది. ఆ రోజుల్లో విస్తారమైన నాచులోనే ఇప్పటికీ చెరువుగట్టుమీద మనుష్యులూ, వాళ్ళ పావంచాలమీద గావంచాలు ఉతుక్కుంటు ఆబోదకాళ్ళ వాళ్ళే – ఆ కావిళ్ళవాళ్ళే! అయ్యో! ఆడవాళ్లు! చెరువులో స్నానంచేసి బట్టలు మార్చుకోడానికి ముసుగుకావాలన్న ఇంగితజ్ఞానం ఈ నాటికీ వీళ్ళకి, ఈ పవిత్రులైన బుద్ధిహీనుల కెప్పటికి కలిగేను! కటకటా ఆచారం!

చెరువు అవతలిగట్టున అదుగో ఆంజనేయస్వామి వారి కోవెల. అక్కడికి వెళ్ళడానికి తనకి మనస్కరించడం లేదు.

చిన్నప్పుడు బడి ఎగేసి మూడుగంటలాట సినిమాకి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వెళ్ళవలసివచ్చినప్పుడు ఆంజనేయులవారిని హాకీబకీగా దర్శించి సింధూరం పెట్టుకొని ఇంటికెళ్ళి 'ఏంవిరా ఇంతాలస్యం' అని అంటే 'కోవెల కెళ్ళా' నని తప్పించుకొనేవాడు. ఇప్పుడు అక్కడికి వెళ్ళవలసిన అగత్యం లేదు.

మంగలి రామన్న మళ్ళా ఎదురయ్యాడు. పొద్దున్న పదిన్నరదాకా వాడంతపనివున్న మంగలి మరొకడు లేడు. వీడు వెయ్యిళ్ళపూజారి. తలమాసిన కుర్రాళ్ళకీ. తలచెడ్డ ముసలివాళ్ళకీ క్షవరంచెయ్యడంలో ఎక్స్పర్టు. పీక బాజా వాయించడంలో ఘటికుడు. వీడి ఎడంచేతికి ఒక సత్తువుంగరం వుండేది. ఇదిగో యిప్పటికీ ఉంది. క్షవరం చేస్తున్నప్పుడు కుర్రాళ్లు అటూ యిటూ కదిలితే ఆ వుంగరంతో ఎవరూ చూడకుండా ఒక మొట్టి మొట్టేవాడు. 'ఒరే కొడుతున్నావురా?' అంటే మీరు కదిలితే తెగుతుంది. నన్నేం చెయ్యమన్నారు! కదలకండి' అనేవాడు. ఆరేళ్లు దాటిన అబ్బాయిలకే క్షవరంచేస్తూవుండగా చూసుకోండికి అద్దం ఇస్తాడు. ఆ అద్దంలో ఇప్పుడు మళ్ళా తనముఖం చూసుకోవా లనిపిస్తున్నది. రామన్న ఆగడే; తనమాట వినడే. ఆ అద్దంలో చూసుకుంటే తన చిన్నప్పటి ముఖం కనబడుతుందేమో! ఈ నాడు ఈ ఊరివాళ్లు, తన ఊరివాళ్లూ, తనని గుర్తుపట్టలేకపోవడానికి కారణం కనబడుతుందేమో!

ఎవరూ తనను పలకించడంలేదని ఉక్రోషంవచ్చి అతడు ఏకాఎకిని గోకిలతోటవైపు నడక ప్రారంభించాడు. దారిలో

పొట్టిమేష్టారు ఎదురొచ్చాడు. ఈయన తన 'చిన్న ఇన్ఫెంటు' క్లాసు మేష్టరు. తనచేత ఓనమాలు దిద్దించిన ఒజ్జ. పెద్దయ్యాక ఇతడు తనకు పెట్టిన తొడపాశాలు, శొంఠిపిక్కలు, వేయించిన గోడకుర్చీలు మింజుమలె కక్ష తీర్చుకొందాం అనుకొన్నాడు. ఇప్పుడు కనిపించాడు. ఈయన్ని చూస్తే జాలేస్తున్నాది. నేడు ఇతనికన్నా తాను విద్యాధికుడు. ఈ మేష్టరికి రామన్ ఎఫెక్టుగురించి తెలియదు. థీరీ ఆఫ్ రెలిటివిటీ... అబ్బే ఈ మేష్టరు మరుగుజ్జు అయినా ఇవాళ ఇతనికి నమస్కరించా లనిపిస్తున్నది. బళ్లో ఈయన అయిదుబళ్ళూ నేర్పించకపోతే తాను ఇంతచదువుకొన్నవా డయ్యేవాడా? ఈయనకి మన స్ఫూర్తిగా దండంపెట్టాలి. చేతులు జోడించాడు. అరే, మేష్టరు అందుకోడే! ఈయనా తనని మరచిపోయాడా!

అతడు గోరీలతోటకి చేరుకున్నాడు, గోడ ఎక్కాడు. ఎవరేనా చూస్తున్నారేమో అని కలయచూశాడు. ఎవరూ తనని పట్టించుకోలేదు. గోడ గెంతాడు. గడ్డిదుబ్బుగా పెరిగింది. అతడు తీరుబాటుగా ఆ గడ్డిలోంచి ఈదుకొంటూ నడిచాడు. చిన్నప్పుడు స్నేహితులతో గడిపిన దినాలు నెమరు వేసుకొన్నాడు. ఒకనాటి మిట్టమధ్యాహ్నం మండుటెండలో తాను ఒంటరిగా గడిపిన గోడదగ్గిరికి వచ్చాడు. ఆ బల్లపరుపు సమాధిమీద కూర్చున్నాడు. సిగరెట్ వెలిగిద్దా మనుకున్నాడు. సిగరెట్ లేదు. లాల్చీ విప్పి చెట్టుకు తగిలిద్దా మనుకొన్నాడు. అరె! తనకి లాల్చీ లేదు.

ఆ సమాధిమీద అక్షరాలు చదివాడు. అవే అక్ష

రాలు. అదే పేరు. వాటిని. తదేకంగా చూస్తున్నాడు 'హల్లో' అన్న పలకరింపు వినబడింది.

'ఎవరూ?' అని అతడో పక్కకి తిరిగాడు.

ఒక పదహారేళ్ళ ఆంగ్లో ఇండియన్ అమ్మాయి కనబడింది. తెల్లని గౌను, తెల్లని పళ్ళు, తెల్లని నవ్వు, చల్లని చూపు.

'ఎవరు మీరు? అని అతను సవినయంగా అడిగాడు'

'నేను జోన్ పాల్సన్ ని-జ్ఞాపకం లేదూ' అని అడిగింది. తన చిన్నప్పటి సంగతులన్నీ జ్ఞాపకం చేసింది.

'ఈ నరకంలో నన్నెవరూ గుర్తుపట్టలేదే—మీరెలా పోల్చుకున్నారు?' అని అతడు అడిగాడు.

'దొంగను పట్టుకోడానికి దొంగే కావాలి' అంది ఆమె.

'అంటే?'

'చచ్చిపోయినవాళ్ళని చచ్చిపోయినవాళ్ళే గుర్తించుతారు' అని ఆమె అతనిపక్క కూర్చుంది.

గడ్డి గాలికి ఊగింది. పైన చెట్టుమీద ఒక కాకి వాలింది. రెండు పువ్వులు రాలాయి.